క్లుప్తంగా

బాలు నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగ పరిశోధకుడు డి.బాలు నాయక్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య బి.కరుణ పర్యవేక్షణలో 'ఏ కంపారిటీవ్ స్టడీ ఆఫ్ ఎల్ఎస్ఆర్ డబ్ల్యు ప్రొఫెసియెన్సీ ఎమాంగ్ ట్రిబల్ అండ్ నాన్- ట్రిబల్ స్టూడెంట్స్ ఇన్ సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ సౌత్ కోస్టర్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను బాలు నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

విద్యాభివృద్ధికి మిషన్ ఫర్ ది యూత్ చేయూత



నెహ్రూనగర్: విద్యార్థుల విద్యాభివృద్ధికి యువత సామాజిక సాంఘిక ఆర్థిక అభివృద్ధికి మిషన్ ఫర్ ద యూత్ ఎంతగానో కృషి చేయటం అభినందనీయమని మాజీ మంత్రి, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో మిషన్ ఫర్ ద యూత్ లోగో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మిషన్ ఫర్ ద యూత్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ తరహా కార్యక్రమాలలో ఉద్యోగులు అందరూ కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఇంజినీర్ బుస్సా రత్న ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాలలో ఉన్న పేద యువతను ఉద్యోగ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

కాపు సంక్షేమ భవనాలు నిర్మించాలి



నెహ్రూనగర్: రాష్ట్రంలో జిల్లాల వారీగా కాపు సంక్షేమ భవన నిర్మాణాల ఏర్పాటుకు కృషి చేయాలని తెలగ అభ్యుదయ సంఘ నాయకులు బాలిశెట్టి విజయకుమార్ విన్నవించారు. ఈ మేరకు మంగళశారం వెలగపూడిలోని సచివాలయంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు సమక్షంలో ఈడబ్ల్యూఎస్ చీఫ్ సెక్రటరీ కె.సునీతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి అమలవుతున్న సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

బీఎల్ఓలకు శిక్షణ

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్(ఐఐఐడీఈఎం) ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఆఫీసర్ల(బీఎల్ఓ)కు ఎన్నికల జాబితా నిర్వహణ శిక్షణ కార్యక్రమాలు దశల వారీగా చేపడుతున్నామని 94 గుంటూరు పశ్చిమ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు పశ్చిమ 94, తూర్పు 95 నియోజకవర్గాల బీఎల్ఓలకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓలు డి.శ్రీనివాసరావు, రాంబాబు, సిహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ పద్మనాభరావు, డెప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఫార్మా డీ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఇటీవల ప్రకటించిన ఫార్మా.డీ పరీక్షా ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా.డి ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరైన 28 మంది విద్యార్థుల్లో 17 మంది డిస్టింక్షన్, 11 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు అభినందించారు.

నేడు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎల్ఐసీ కాలనీ, భాగ్యనగర్, ఎస్వీఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.



పొన్నూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా తదితరులు



మారంరెడ్డి భాస్కరరెడ్డి అందించిన రూ.30 వేల ఆర్థిక సాయాన్ని విద్యార్థినికి అందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



జిల్లా కోర్టు ఆవరణలో వైఎస్సార్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, న్యాయవాదులు

సంక్షేమ రథసారథి వైఎస్సార్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, వెస్ట్ సమన్వయకర్త అంబటి రాంబాబు

పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వైఎస్సార్ అంటే నచ్చని ప్రభుత్వం వచ్చినా కూడా వాటిని పక్కన పెట్టలేనంత దూరదృష్టితో ప్రజల కోసం కార్యక్రమాలు చేపట్టారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కొనియాడారు. మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ అంటే ఒక వ్యక్తి కాదని.. ఒక ఎమోషన్ అని చెప్పారు. ఆయన జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఒక వైద్యుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి, అంచలంచెలుగా ఎదిగిన ఘనకీర్తి వైఎస్సార్ సొంతమన్నారు. రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్సార్‌ను తెలుగు ప్రజలు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించారని చెప్పారు. వైఎస్సార్ అంటే అందరిలాంటి ముఖ్యమంత్రి కాదని, స్వయంగా ప్రజాబలం కలిగిన నాయకుడని కొనియాడారు. పేదరికం వలన విద్య మధ్యలో ఆగకూడదని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తీసుకునివచ్చారని, పేదవాడు కూడా ఉన్నత హాస్పిటల్ వెళ్లి వైద్య సేవలు పొందాలని ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అంగీకరించకపోయినా రైతులకు ఉచిత విద్యుత్ అందించి తాను రైతు పక్షపాతినని చాటి చెప్పారని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తే కరెంటు తీగలు మీద బట్టలు ఆరేసుకోవాలని చంద్రబాబు హేళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగిన నిమిషాల వ్యవధిలో 108 అంబులెన్స్ వస్తుందంటే అదీ వైఎస్సార్ పుణ్యమేన్నారు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి వాగ్దానం చేసి, అమలు చేసిన నాయకుడు వైఎస్సార్ అని అన్నారు. రెండోసారి గెలుపొందిన మూడు మాసాలలో ఆయన మరణించడం బాధాకరమన్నారు. వైఎస్సార్ ఉండి ఉంటే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ఎంతో ముందు ఉండేదని వివరించారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. పార్టీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన సంతకాన్ని ఆటోగ్రాఫ్‌గా మార్చుకునేలా ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి పాటుపడిన మహనీయుడు వైఎస్సార్ అని అన్నారు. వైఎస్సార్ భౌతికంగా దూరమై 16 సంవత్సరాలు ప్రజల గుండెల్లో ఆయన బతికే ఉన్నారన్నారు. రాజశేఖర రెడ్డి మరణం లేని మహానేత అని కీర్తించారు. వైఎస్సార్ జన్మించింది తన కుటుంబం కోసం కాదని, పేదబడుగు బలహీనవర్గాల కోసమన్నారు. 2029లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంని చేసుకోవటం ద్వారానే వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లగలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు.



స్తంభాల గరువు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ విజయవాడ పార్లమెంటరీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి

మరణంలేని మహానేత వైఎస్సార్

పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం లేని మహనీయుడని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని కొత్తపేట, నెహ్రూనగర్, మంగళదాస్‌నగర్, పాతగుంటూరు, నందివెలుగురోడ్డు, పొన్నూరు రోడ్డు, సంగడిగుంట, ఐపీడీ కాలనీ, లాలాపేట, నల్లచెరువు, ఏటుకూరురోడ్డు, శ్రీనగర్, రైలుపేట, కాకాని రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి, వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ సంక్షేమం అంటేనే గుర్తుకు వచ్చేది మహానేత వైఎస్సార్.. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి పేదవాడి గడప ముందుకు సంక్షేమాన్ని అందజేసి.. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నతుడు అని కొనియాడారు. మైనారిటీ వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, విద్యా, వైద్యాన్ని ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేశారన్నారు. మహానేత వైఎస్సార్ అనంతరం అంతటి సంక్షేమ, సువర్ణ పాలనను వైఎస్ జగనన్న ద్వారానే సాధ్యపడిందని స్పష్టం చేశారు. 2029లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకుని వచ్చి, జగనన్నను సీఎం చేసుకోవటం ద్వారానే మహానేత ఆశయాలను సజీవంగా బతికించిన వాళ్లమవుతామని పేర్కొన్నారు.



దివంగత నేతకు పూలాభిషేకం

న్యాయవాదుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నాయకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ, స్టేట్ లీగల్ సెల్ కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ సీడీ భగవాన్, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మంజుల, శ్యామల ఇందిరా వెంకటరమణ, సోనియా, సుకన్య రచన, రత్న, లత, సౌజన్య ,మాధవి సుకన్య, మమత, అనుజ్ఞ సుధ, స్నేహ, కాసం వెంకట్ రెడ్డి, వజ్రాల రాజశేఖర్ రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, సింగ్ క్రాంతి, చల్లా క్రాంతి, బాబు రావు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో..

కొరిటెపాడులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, పార్టీ గుంటూరు పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంపాలెం, పట్టాభిపురం స్వామి థియేటర్, స్తంభాల గరువు, జిల్లా కోర్టు వద్ద వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్తంభాలగరువు వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నగరంలో దశల వారీగా వెండింగ్ జోన్లు



మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

నెహ్రూనగర్: నగరంలో దశలవారీగా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నామని, ఇందుకు నగర ప్రజలు, వీధి వ్యాపారులు సహకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల శాసన సభ్యులు మహ్మద్ నసీర్, గళ్లా మాధవి, డెప్యూటీ మేయర్ షేక్ సజీలతో కలిసి మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో తొలుత మోడల్‌గా నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాల్లో ఉండే వీధి వ్యాపారులకు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ వెండింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 10న విద్యా సంస్థల్లో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందించాలన్నారు. నగరంలో ఈ సీజన్‌లో 5 లక్షల మొక్కలను దశల వారీగా నాటడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందులో ఇప్పటికే సుమారు 33 వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలో తొలుత వీధి వ్యాపారుల వలన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్న ప్రాంతాల్లో వారికి జోన్ల ఏర్పాటు చేయాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ప్రస్తుతం వారు వ్యాపారాలు చేసుకుంటున్న ప్రాంతాల్లో జోన్ల ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది అభ్యంతరాలు లేకుండా ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు.

తాగునీటి రిజర్వాయర్లను శుభ్రం చేయాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం లాడ్జి సెంటర్‌లోని హెచ్ఎల్ఆర్‌ని తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని తాగునీటి రిజర్వాయర్లను షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయాలని, శుభ్రం చేయడానికి ముందు, తర్వాత ఫొటోలను తీయాలన్నారు. ప్రస్తుతం శుభ్రం చేసిన తేదీ, తదుపరి శుభ్రం చేయాల్సిన తేదీలను బోర్డుల మీద ఏర్పాటు చేయాలన్నారు.

రాధికకు ఆర్థిక సాయం అందజేత

జీజీహెచ్ వద్ద టిఫిన్ బండి పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని యశ్వంత్ అనే బాలుడు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన విషయం పలు మీడియా కథనాల్లో ప్రచురితమైన విషయం తెలిసిందే. నగర కమిషనర్ టిఫిన్ బండి పెట్టుకోవడానికి స్థలం కేటాయించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ చంద్రకాంత్ మంగళవారం రాధికకు, ఆమె కుమారుడు ఆర్థిక సాయం కింద రూ.5వేలు నగదు, దుస్తులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సమక్షంలో అందజేశారు.

సాయినాథునికి నాగవల్లీ దళార్చన



సాయినాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవాలు ఐదో రోజుకు చేరాయి. మంగళవారం సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయినాథునికి నాగవల్లీ దళార్చన నిర్వహించారు. మహిళా భక్తులు తమలపాకులతో స్వామి పూజ చేశారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు సాయినాథుని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయినామ సప్తాహం ఐదో రోజు కొనసాగగా, ఆలయ గౌరవాధ్యక్షులు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, స్వరూపరాణి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో షిరిడి సాయి వ్రతాలు

స్థానిక వికాస్‌నగర్ 11వ వీధిలోని షిరిడి సాయి మందిర్‌లో మందిర 26వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. నిర్వాహకులు పూర్ణచంద్రరావు దంపతులు, పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టగా, ఉదయం షిరిడి సాయిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

స్మార్ట్ టీవీ బహూకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో చదువుకున్న 1975–78 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థులు మంగళవారం రూ.లక్ష విలువ చేసే స్మార్ట్ టీవీని బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, పూర్వ విద్యార్థిని కె.నాగలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఏ భానుమురళీధర్, పూర్వ విద్యార్థులు యలమంచిలి మురళి, కిలారి కృష్ణారావు, విద్యాసాగర్‌రెడ్డి, మధుబాబు, లీలాకృష్ణ, మనోహర్, ప్రసాద్, ఖలీల్, ఖాసిం, ఇమామ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో మంగళవారం క్యాబినెట్ మండలి విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఏవో కె. వెంకట్రావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ బి. శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవ పున్నయ్య విద్యార్థి నాయకులకు అభినందనలు తెలిపారు.

వైద్య అధికారులకు ముగిసిన శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులకు రెండో రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలో మాతృ, శిశు మరణాలు తగ్గించడానికి, మహిళలకు గర్భధారణ సమయంలో సంక్రమించే ప్రమాదకర వ్యాధులు, ఇతర హైరిస్క్ లక్షణాల నివారణ, ట్రాకింగ్, మేనేజ్మెంట్ గురించి, అరమ్మాన్, యూనిసెఫ్ సహాయ సహకారంతో ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణనిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, శిక్షకులు డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీవల్లి, అరమ్మాన్ ప్రతినిధి వెంకటేష్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రత్నావళి, డాక్టర్ ప్రియాంక, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సమ్మెకు బ్యాంక్ యూనియన్ల మద్దతు

లక్ష్మీపురం: సార్వత్రిక సమ్మెకు గుంటూరులోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు, ఎల్ఐసీ ఉద్యోగులు మద్దతు తెలిపారు. నగరంపాలెంలోని మంగళవారం సాయంత్రం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసు వద్ద పలు బ్యాంక్ ఉద్యోగులు, ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ ఎంప్లాయి కో-ఆర్డినేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ బాషా మాట్లాడుతూ కేవలం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 కోడ్స్ రూపంలో కార్పొరేట్ అనుకూలంగా చట్టాలను మార్పు చేయడం ద్వారా కార్మిక హక్కులను హరించివేసే విధానాలను ప్రవేశపెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్నారు. బుధవారం సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆఫీసర్ నాయకులు రాంబాబు, భాషా, వేణు, రవిచంద్రారెడ్డి, మురళీ,షరీఫ్, అఖిల, క్రాంతి,ఎస్‌బీఐ నాయకులు సంపత్ మాట్లాడుతూ సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఆరోగ్య విప్లవాన్ని సృష్టించిన ఘనత డాక్టర్ వైఎస్సార్‌దే

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య విప్లవాన్ని సృష్టించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆధునిక కార్పొరేట్ వైద్యాన్ని పేదవాడి ఇంటి ముంగిట్లోకి తెచ్చారని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్-ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గొప్ప జ్ఞాపకాలు శీర్షికన 'ఆరోగ్య సేవలు-డాక్టర్ వైఎస్సార్' అనే అంశంపై మంగళవారం వెబినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ కవి కాపిరెడ్డి కృష్ణారెడ్డి మోడరేటర్‌గా మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయాలు, సేవలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేకంగా ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో ఏర్పడిన ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను వివరిస్తూ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, 104,108 అంబులెన్స్ వంటి విప్లవాత్మక పథకాలు, తాను చూసిన అనుభవాలను, జ్ఞాపకాలను మనసును తాకేలా పంచుకున్నారు. వైఎస్సార్ ఒక దయామయుడు, ప్రజల కష్టాలను తనవిగా భావించిన నాయకుడని, ఆరోగ్య రంగంలో అమూల్యమైన మార్పులు తీసుకువచ్చిన దార్శనికుడిగా కొనియాడారు.వెబినార్‌లో జర్మనీ నుంచి రత్నరాజు. బెంగళూరు నుంచి విష్ణుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ రంగాల ప్రముఖులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ సీనియర్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చేతుల మీదకు మంగళవారం శారదాకాలనీలోని వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త భాస్కర్ కుటుంబానికి రూ. 40 వేలు అందజేశారు. ఇటీవల కాలంలో భాస్కర్ అనారోగ్యకారణంగా మృతి చెందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నగరంపాలెం: యువత భవిష్యత్‌ను నాశనం చేసే మత్తు పదార్థాల విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా ఆదేశాల మేరకు, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

గల్లంతైన యువకుడిని కాపాడిన పోలీసులు



బాపట్లటౌన్: సముద్ర స్నానం చేస్తూ అలల తాకిడికి గల్లంతైన యువకుడిని కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు మంగళవారం రక్షించారు. గుంటూరులోని మునిస్వామినగర్‌కు చెందిన చిలకా భాస్కర్ తన స్నేహితులతో కలిసి సూర్యలంక సముద్రస్నానానికి వచ్చారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. గల్లంతైన యువకుడిని తన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేదు. దీంతో ఒక్కసారిగా కేకలు వేయడంతో తీరంలో పహారా నిర్వహిస్తున్న సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ ఏఎస్ఐ అద్దంకి చక్రవర్తి, హెడ్‌కానిస్టేబుళ్లు హరికృష్ణ, నాగరాజు, హోంగార్డ్ శ్రీనివాసరావు అప్రమత్తమై భాస్కర్‌ను కాపాడారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కొరకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం భాస్కర్ ఆరోగ్యం సురక్షితంగా ఉందని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.